ప్రజాశక్తి

శనివారం 13 సెప్టెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కొలిక్కిరాని తురకపాలెం నివేదికలు



తురకపాలెంలో వైద్యశిబిరం ద్వారా గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

- మరో వారంలో తేల్చాలని మంత్రి ఆదేశం
- 109 బ్లడ్ కల్చర్ రిపోర్టుల్లో నలుగురికి మెలియోడోసిస్ గుర్తింపు
- వీరిలో ఒకరు మృతి చెందినట్టు నిర్ధారణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ గ్రామమైన తురకపాలెంలో అసాధారణ మరణాలకు దారితీసిన కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. సమగ్ర నివేదికను వారంలోగా అందజేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. వరుష మరణాలను ప్రభుత్వం దృష్టికి తేవడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు.

ఇప్పటి వరకు నిర్వహించిన అనేక పరీక్షల్లో మరణాలకు కారణాలను కనుగొనలేక పోయారు. గ్రామంలో 18 ఏళ్ల దాటిన వారు 2018 ఉండగా వీరిలో 1501 మందికి 42 రకాల పరీక్షలు నిర్వహించారు. 1,501లో 109 మంది జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా నలుగురికే మెలియోడోసిస్ ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఒకరు మరణించగా ముగ్గురు కోలుకున్నారు. మట్టి నమూనాల పరీక్షల ఫలితాలు ఇంకా అందలేదు. గ్రామంలో రెండు నెలల వ్యవధిలో 22 మంది మృతికి ఇతర కారణాలను గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. ఎక్కువ మందికి కొలెస్ట్రాల్ సమస్య అధికంగా ఉందని గుర్తించారు. షుగర్, కిడ్నీ సమస్యలు, లివర్ డ్యామెజి, తెల్లరక్తకణాల లోపం, రక్తహీనత, ఎర్ర రక్త కణాల సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలున్నట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే మరణాలపై క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రభుత్వానికి సకాలంలో సమాచారం ఇవ్వకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఇక మీదట ప్రతి మరణాన్నీ ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదుకు ప్రభుత్వం నిర్ణయించింది.

మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని వైద్యసంస్థలు పరిశోధన చేసినా మరణాలకు స్పష్టమైన కారణాలు కనుగొనలేకపోయారు. నీటి నమూనాలు బాగానే ఉన్నాయని, ▶ 2లో



యూరియా కోసం గోదాము వద్ద బారులుదీరిన రైతులు

యూరియా కోసం బారులుదీరిన రైతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

యూరియా కోసం సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిడిసిఎంఎస్ గోదాము వద్ద శుక్రవారం రైతులు బారులు తీరారు. సుమారు 500 మంది రాగా 200 మందికి 400 బస్తాలను అధికారులు అందించారు. మిగతా 300 మంది నిట్టూరుస్తూ వెనుదిరిగారు. యూరియా కోసం వచ్చిన వారిలో పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ల, క్రోసూరు ▶ 2లో

అందుకే కొరత సృష్టిస్తున్న కేంద్రం : కౌలురైతు సంఘం

సబ్సిడీని తగ్గించుకోవడానికి, విదేశాల నుండి దిగుమతి చేసుకోకుండా, నానో లిక్విడ్ యూరియా వినియోగాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం కావాలనే యూరియా కొరత సృష్టిస్తోందని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ విమర్శించారు. ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు భజన చేస్తున్నారేగాని, రైతుల ఇబ్బందులను తీర్చడానికి కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదని అన్నారు. పత్తి, వరి పైర్లకు యూరియా తక్షణావసరమని, అన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం దయా దాక్షిణ్యాలపై యూరియా వస్తుందంటూ రైతుల్ని నమ్మించి మోసం చేస్తున్నారని అన్నారు. రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయకుంటే ఉద్యమిస్తామన్నారు.



జీతాల కోసం చలో సిఆర్‌డిఎ

తుళ్లూరులో రాజధాని పారిశుధ్య కార్మికుల భారీ ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ చేపట్టారు. రెండు నెలలుగా ఇవ్వని జీతాల కోసం ఎన్ని విజ్ఞప్తులు, నిరసనలు చేసినా ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు పెడచెవిన పెట్టడంతో 'చలో తుళ్లూరు సిఆర్‌డిఎ'కు పూనుకున్నారు. సిఆర్‌డిఎ కార్యాలయంలోకి ప్రవేశించే మార్గంలో బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఎల్ అండ్ టి, ఎన్‌సిసి లాంటి నిర్మాణ సంస్థలకు రూ.వందల కోట్లు అడ్వాన్స్‌గా ఇస్తున్న ప్రభుత్వం చమటోడ్చి పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఎందుకివ్వడం లేదని నిలదీశారు. పారిశుధ్య కార్మికులు బలహీనవర్గాలు, దళితులు, పేదలు, మాట్లాడలేని వారనే అలుసా అని అలుసా అని అన్నారు. రోడ్డెక్కి ఆందోళన చేస్తేగాని జీతాలు చెల్లించరా? అని ప్రశ్నించారు. కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, అప్పులు ఇచ్చేవారు కూడా లేక కుటుంబాలు గడవక ఆకలి కేకలు వేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన ▶ 2లో

జులై నెల జీతం జమ

రాజధాని పారిశుధ్య కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జులై నెల జీతాన్ని అధికారులు జమ చేశారు. ఉదయం ఆందోళన నేపథ్యంలో అధికారులు స్పందించి సాయంత్రానికి జమ చేశారు. ఆగస్టు నెల జీతాన్ని కూడా వెంటనే జమ చేయాలని ఎం.రవి కోరారు.



మంగళగిరి క్షేమంగా చేరిన యాత్రికులు

మా బస్సు అద్దాలు పగలగొట్టారు..

డ్రైవర్ చొరవతో లాడ్జీకి చేరాం

నేపాల్ నుండి క్షేమంగా తిరిగొచ్చిన పట్టణ వాసుల అనుభవాలు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి నుండి నేపాల్ తీర్థయాత్రలకు వెళ్లిన ఎనిమిది మంది సభ్యులు శుక్రవారం తెల్లవారుజామున మంగళగిరి చేరారు. మంగళగిరి నుండి చింతక్రింది ప్రసాద్, పద్మావతి, మాచర్ల హేమ సుందర్రావు, వెంకట నాగకుమారి, దామర్ల శివరామకృష్ణ, నాగలక్ష్మి, గోలి వరదరాజు, రమాజ్యోతి దంపతులు క్షేమంగా చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేపాల్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని, అయితే రాష్ట్ర మంత్రి నారా లోకేష్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల తాము బయటపడ్డామని చెప్పారు. నేపాల్‌లోని ఖాట్మండులో తాము వస్తున్న బస్సుపై దాడి జరిగిందని, అద్దాలు పగలగొట్టినా డ్రైవర్ వేగంగా బస్సును ముందుకు పోనిచ్చి ఒకచోట లాడ్జిలోకి తమను చేర్చారని వివరించారు. అక్కడ ఘటనలు చూసిన తర్వాత భయాందోళనకు గురయ్యమన్నారు. నేపాల్ నుండి విశాఖపట్నం వరకు విమానంలో వచ్చామని, అక్కడి నుండి బస్సు ద్వారా ఇళ్లకు తీసుకొచ్చి దింపారని సంతోషం వ్యక్తం చేశారు.



నరసరావుపేటలో నివాళి

దేశం గర్వించదగ్గ మహానేత ఏచూరి

ప్రథమ వర్ధంతి సభల్లో ఘన నివాళులర్పించిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

దేశం గర్వించదగ్గ నాయకుడు, మహోన్నత మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు వై.నేతాజి, గుంటూరు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం సభలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. గుంటూరు బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీతారాం ఏచూరి ఓ సోషలిస్టు ఆచరణ పథం ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నరసరావుపేట మండల కార్యదర్శి డి.శివకుమారి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఆయా సభల్లో నేతాజి, విజయ్‌కుమార్ మాట్లాడుతూ ▶ 2లో



గుంటూరులో నివాళి..

పెరిగిన ప్రవాహం.. తెరుచుకున్న 8 గేట్లు 2లో

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితులైన తమీమ్ అన్సారియా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. సెలవు రోజు అయినా ఆమె బాధ్యతల స్వీకరణకు గుంటూరు రానున్నారు. ప్రస్తుతం ప్రకాశం కలెక్టర్‌గా ఉన్న తమీమ్ అన్సారియా గుంటూరు కలెక్టరుగా నియమితులైన సంగతి తెలిసిందే. 2015 బ్యాచ్‌కు చెందిన ఆమె ముక్కుసూటిగా, నిజాయితీ కలిగిన అధికారిగా పేరుగాంచారు.



పట్నంబజారులో పర్యటించిన కమిషనర్

డ్రెయిన్లపై ర్యాంప్‌లను తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లలో వ్యర్థాలు తీయడానికి వీలు లేకుండా ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను తక్షణం తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్నం బజార్, ఏలూరు బజార్ ప్రాంతాల్లో డ్రైన్లపై ర్యాంప్‌లను, శ్రీనివాసరావుతోట ప్రాంతంలో డ్రైన్లలో పేరుకున్న వ్యర్థాలను, పీకల వాగు పక్కన చెత్త డంపింగ్‌ను, చౌడవరంలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావుతోట ప్రాంతంలో డ్రైన్లలో వర్షానికి వచ్చిన వ్యర్థాలను తొలగించకపోవడంపై సచివాలయ శానిటేషన్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తంచేసి, వెంటనే తొలగించాలన్నారు. చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించి, పారిశుధ్యం, త్రాగునీరు వంటి మౌళిక వసతులను వారం రోజుల కాల పరిధిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాస రావు, ఈఈ వేణు, డిఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ పుల్లారావు

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

ప్రజాశక్తి - నాదెండ్ల

అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్సై జి పుల్లారావు తెలిపారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం భద్రక్ జిల్లా తిహిడి మండలం కాన్దాడా గ్రామానికి చెం దిన ఉత్తమమాలిక్ అదే రాష్ట్రం శ్రీ పూరి జిల్లా పరికొండ మండలం రసకుడి గ్రామానికి చెం దిన భూలు బెహరా ప్రసన్న ఈ కార్యక్రమా లకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 700గ్రాములు గంజాయి, రూ.400ను స్వాధీనపరుచుకుని కేసు నమో దు చేసినట్లు తెలిపారు. స్పిన్నింగ్ మిల్లు చుట్టు పక్కల ఏరియాల్లో అక్రమంగా గంజా యి కలిగి ఉండటం, అమ్మకం, గంజాయి తాగటం జరుగుతున్నట్లు అందిన సమా చారం మేరకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్సై తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో చిలకలూరిపేట నూతన వేసిన ఎన్‌హెచ్ 16 బైపాస్ రోడ్డు దగ్గర గణపవరం నుండి కావూరువైపు డొంక రోడ్డు దగ్గర అక్కడ గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా కనుగొని సిబ్బందితో పట్టు కొని మధ్యవర్తుల సమక్షంలో గంజాయి డబ్బు లు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొలిక్కిరాని తురకపాలెం నివేదికలు

(మొదటి పేజీ తరువాయి)

పారిశుధ్యం పెద్ద సమస్య కాదని ఆయా శాఖలు చేతులు దులుపుకొన్నాయి. అయితే వివిధ ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మాత్రం మరణాలకు తాగునీటి కాలుష్యం, పారిశుధ్య లోపం కూడా ప్రధాన కారణంగా చెబుతున్నా అధికారులు దీన్ని తోసిపుచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిఫార్సులు చేయాలని వైద్య సంస్థలకు మంత్రి సత్యకుమార్ సూచించారు. మరణించిన వారి కేస్ షీట్లను నిశిత పరిశీలన చేయాలన్నారు. గత పదేళ్లలో జరిగిన మరణాలపై పరిశీలన చేసి మృతుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను ప్రామాణికంగా తీసుకుని ఈ అంశానికి ముగింపు పలకాలని అధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

జీతాల కోసం చలో సిఆర్‌డిఎ

(మొదటి పేజీ తరువాయి)

వెలిబుచ్చారు. తక్కువ జీతాలు, అవీ సరిగా రాని కారణంగా ఇప్పటికే సగం మంది మానేశారని, దీంతో ముగ్గురు చేసే పనిని ఒక్కరితో చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రమంతా పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు ఇస్తుండగా, రాజధానిలో రూ.12 వేలే ఇస్తున్నారని తెలిపారు. జీవో 36 అమలు చేసి రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను కొందరు చులకనగా చూస్తూ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని, చీటికిమాటికి పని నుండి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ మేరకు సిఆర్‌డిఎ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సుశీల, కె.గోపిరాజు, ఎల్.సుభవేణి, వి.బుజ్జి, విజయ్‌కుమార్, జోజి, అరుణ్‌కుమార్, పి.రత్నకుమారి, భూలక్ష్మి, వి.అరుణ, జ్యోతి, మాలతి, ముత్యాలు, తిరుపతమ్మ, దుర్గ, పార్వతి, శివకుమారి, వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు పి.బాబురావు, కె.ఆంజనేయులు, షేక్ జానీ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మహానేత ఏచూరి

(మొదటి పేజీ తరువాయి)

మార్క్సిజాన్ని దేశ పరిస్థితులకు అన్వయించి ముందుకు తీసుకువెళ్లే నేటితరంలో ఏచూరి ప్రముఖుడన్నారు. వామపక్షాలతో కలిసి ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో ఉమ్మడి కార్యక్రమం రూపొందిచడంలో, దానిని అమలు చేయించటంలో పార్లమెంటేరియన్‌గా ఆయన కృషి మరవలేనిదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక దేశభక్తి పేరుతో మతాలు, ప్రాంతాలు, కులాల మధ్య ఘర్షణలు పెడుతూ ప్రజల మధ్య చీలికలు తెస్తోందని, ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి పేరుతో దేశ చరిత్రను వక్రీకరించి, కట్టుకథలను వ్యాప్తిజేసి భారతీయ భావనకు వికృత రూపాన్ని ఇవ్వబూనుకుందని విమర్శించారు. పాఠ్యపుస్తకాల్లో జాతీయోద్యమ నాయకుల చరిత్రను, వాస్తవ చరిత్రను తొలిగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని నిరోధించడానికి ఇండియా బ్లాక్ ఏర్పాటులో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. సోషలిజం సాధన కోసం జరిగే పోరాటంలో లౌకిక విలువలను కాపాడుకోవడం ముఖ్యమైన భాగం అని నమ్మి, జీవితాంతం కృషి చేసిన సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుదామన్నారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని, ఆయనను కోల్పోవడం కమ్యూనిస్టులకు తీరని లోటని అన్నారు. అనేక కమ్యూనిస్టు దేశాల్లో పర్యటించిన సీతారాం ఏచూరి అక్కడివారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారని గుర్తు చేశారు. గుంటూరు సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, నాయకులు వై.కృష్ణకాంత్, బి.ముత్యాలరావు, ఎమ్.ఎ చిష్టీ, కె.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.కిరణ్, ఎం.సాంబశివరావు, జి.వెంకట్రావు, సతీష్ పాల్గొన్నారు. నరసరావుపేట సభలో సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, ఏపూరి గోపాలరావు, నాయకులు సయ్యద్ రబ్బాని, కె.ఆంజనేయులు, పెద్దిరాజు, ఎం.రాంబాబు, బోసు, సిపిఐ నాయకులు రాంబాబు, సత్యనారాయణ రాజు, రంగయ్య, పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులుదీరిన రైతులు

(మొదటి పేజీ తరువాయి)

మండలాలతోపాటు గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల రైతులూ ఉన్నారు. తొలుత గోదాము వద్దకు రైతులు భారీగా రావడంతో తోపులాట జరిగి కేంద్రాన్ని సిబ్బంది మూసేశారు. తర్వాత వ్యవసాయ అధికారులు దగ్గరుండి స్లిప్పులు పంచి వాటికనుగుణంగా యూరియాను అందించారు.

పెరిగిన ప్రవాహం.. తెరుచుకున్న 8 గేట్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటివిడుదల కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం 2 గేట్ల ద్వారే నీటిని విడుదల చేసినా వరదప్రవాహం మరింత పెరగటంతో సాయంత్రానికి మరో 6 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 1,17,240 క్యూసెక్కుల నీరు వస్తుండగా 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,720 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 589.90 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 311.7462 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33,495 క్యూసెక్కులను, కుడికాల్వ ద్వారా 10 వేలు, ఎడమ కాల్వ ద్వారా 6325, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.



బీసీలకిచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : కూటమి ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన వాగ్దానాల అమలులో తాత్సారం తదని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం నుండి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ బిసిలు వెన్నెముక అని చెప్పుకునే ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన హామీలు అమలు చేసి వెన్నెముకను నిలబెట్టుకుంటారో, విరగొట్టు కుంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నం అయ్యిందన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ హిట్ అని ప్రచారం చేసుకుంటూ 15 నెలల పాలనలో బిసిలకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బిసిలపై జరుగుతున్న దాడులను నుండి రక్షించటానికి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. ఇప్పుడు దాని ఊసెత్తట్లేదన్నారు. అలాగే చట్ట సభలలో 33 శాతం, స్థానిక సంస్థలు–నామినేటెడ్ పదవులు–నామినేషన్ వర్క్సులో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామని మరో వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఏప్రిల్‌తో స్థానిక సంస్థల గడువు ముగుస్తున్నందున మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహిస్తామని ఎలక్షన్ కమిషన్ చెబుతుందన్నారు.కానీ ఇంతవరకు రాష్ట్రంలో కుల గణనను సమగ్రంగా నిర్వహించకుండా, స్థానిక ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ బిసిలకు కల్పించాలని, ఎన్నికలకు ముందే కులగణన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ బిసి కార్పొరేషన్లకు నిధులు లేక కునారిల్లుతున్నాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా బిసి కార్పొరేషన్లను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్పొరేషన్లకు నిధులు, విధులు కేటాయించాలన్నారు. నిరసన అనంతరం డిఆర్‌ఓకు వినతిపత్రం అందచేశారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, కె.హనుమంతరావు, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024 ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఏపి బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, బాధ్యులున్న శ్రీను మాట్లాడుతూ అనాదిగా ఆధిపత్య పెత్తందారీ సమాజంలో అణిచివేత పీడన దోపిడీలకు గురవుతూ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న బీసీలకు ఎస్.సి, ఎస్.టి మాదిరిగానే ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని వాగ్దానం చేసి విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కొల్లిపర బాలాజీ, సుతారం విశ్వేశ్వరరావు, సరికొండ తిమ్మరాజు, ఫణిదం బోసు బాబు, అల్లూరి శేఖర్, వినుకొండ అప్పారావు, మేకల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న యూరియా బస్తాలు

30 బస్తాల యూరియా స్వాధీనం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల యూరియాను స్వాధీన పరచుకున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ శుక్రవారం మాచర్ల నుంచి ఏకోనాంపేట వైపు 30 బస్తాల యూరియా వెళుతుందన్న సమాచారం తెలిసి దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. 45 కిలోల 30 యూరియా బస్తాలు స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దాడిలో మాచర్ల ఏ ఓ పాప కుమారి, పిఎస్ఐ రాంబాబు, ఏఈఓలు మార్కండేయులు, చౌదరి రెడ్డి, విఆర్ఓ రవి కుమార్, విఏఏలు అంజినాయక్, జాస్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జడ్‌పి హైస్కూలు క్రీడాకారులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కడియం జయరావు తెలిపారు. పలనాడు జిల్లా నందిగామలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14, 17 బాల బాలికల చపక్ తక్రా పోటీలలో కొర్రపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు జయరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోట వెంకట శివ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్ర శేఖర్, జయలక్ష్మి, అమల, శివనాగమని, రాధ, సౌజన్య ప్రకాష్. బాబు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోటీలకు ఎన్నికైన క్రీడాకారులుల

సచివాలయ ఉద్యోగులు ఆందోళన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తమ ప్రాథమిక విధులకు సంబంధం లేని అదనపు పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, ఈ పనిభారం నుండి విముక్తి కల్పించాలని కోరుతూ ఫిరంగిపురం మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం స్థానిక ఎంపీడీఓ శివసుబ్రమణ్యంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పత్రాన్ని అందజేశారు. కొంత కాలంగా ప్రభుత్వం తమకు కేటాయించిన విధులతో పాటు, సర్వేలు, ఇతర శాఖలకు సంబంధించిన పనులను కూడా తమపై మోపుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తాము చేయాల్సిన విధులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే రాష్ట్ర వ్యాప్త నిరసనకు పిలుపునిస్తామని హెచ్చరించారు.



మృతి చెందిన వ్యక్తి

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - వినుకొండ

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వినుకొండ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్ద ఎన్ఎస్పీ కెనాల్‌లో మృతదేహాన్ని శుక్రవారం ఉదయం కొనుగొన్నారు. సమాచారం తెలుసుకొన్న వినుకొండ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని కెనాల్ నుంచి వెలికి తీయించారు. మృతుని వయస్సు 25 నుండి 30 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై స్కైబ్లూ చొక్కా, లైట్ కాఫీ కలర్ ప్యాంటు, చొక్కా కాలర్‌పై కంఫర్ట్ ఫిట్ అని లేబుల్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తుపడితే వినుకొండ టౌన్ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండలంలోని వేమవరం గ్రామ సమీపాన గుంటూరు కర్నూలు హైవే రోడ్డు ప్రక్కన ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద కారు అదుపుతప్పి రెండు పల్టీలుకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల మేలరకు గుంటూరు వల్లూరి వారి తోటకు చెందిన జి ప్రసాదరావు, అతని స్నేహితుడు ఇద్దరు కలసి కారులో శ్రీశైలం నుండి గుంటూరు వెళుతుండగా వేమవరం గ్రామ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న ఆయనే స్వామి షెడ్డు షెడ్డు ప్రక్కనే ఉన్న నాలుగు బైకులను సమీపంలో ఉన్న చెట్టును ఢీకొని ఫల్టీలు కొట్టింది రెండు బైకులు నుజ్జుఅవ్వగా మరో రెండు బైకులు దెబ్బ తిన్నాయి. కారులో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణ నష్టం జరగలేదని తెలిసింది.



కాలేజీలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక జె.యం.జె మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఉచితకంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శిబిరంలో వైద్య సేవలు పొందారు. కంటి పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు స్వప్నశ్రీ గంజి, బాషా, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తరచూ కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని, చిన్న వయసులోనే కంటి సమస్యలు గుర్తిస్తే, భవిష్యత్తులో పెద్ద సమస్యలు రాకుండా నివారించవచ్చునని చెప్పారు. అవసరమైన విద్యార్థినులకు ప్రభుత్వ సహకారంతో ఉచిత కళ్లజోళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది పి.కుమారి, ఆర్. మాధురి, బి.గంగాధర్, బి. నాగబాబు సేవలందించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శాంత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రోజలిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, డా.పి. జెన్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



వైద్య బృందంతో విద్యార్థినులు

మతోన్మాద ముప్పును ముందే పసిగట్టిన సీతారాం ఏచూరి

ప్రథమ వర్ధంతి సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సభలు - చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులు


తుళ్లూరు

మార్క్సిజాన్ని అధ్యయనం చేసి, ఆచరించిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. శుక్రవారం సిపిఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అనేక చోట్ల వర్ధంతి సభలు నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఇందులో భాగంగా

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లాల విలేకర్లు


గుంటూరు

తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలోని కొరటాల, బాపనయ్య భవన్‌లో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించగా చిత్రపటానికి రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశానికి మతోన్మాద ఉపద్రవాన్ని ముందే పసిగట్టి, దేశానికి పెనుముప్పు రాబోతుందని చెప్పిన గొప్ప దార్శనికుడు సీతారాం అన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలో అధ్యయనం చేసిన గొప్ప మేధావి అని, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసేందుకు నిరంతరం కృషి చేసేవారని గుర్తు చేశారు. కమ్యూనిజం, మార్క్సిజానికి కాలం చెల్లిందని అంటున్న ఈ తరుణంలో ప్రపంచంలోనే ఐదు దేశాల్లో తిరుగుబాటు మొదలైందని, పెట్టుబడిదారీ విధానంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరుగుతాయని ఆనాడే కారల్ మార్క్స్ చెప్పాడని గుర్తు చేశారు. కేశవరావు మాట్లాడుతూ సీతారాం చిన్నతనం నుండి విద్యార్థి సంఘం నాయకుడిగాను ప్రతి విషయాన్ని అధ్యయనం చేసేవాడని అన్నారు. అధ్యయనం ఆచరణ కలగలిసిన దిట్టని చెప్పారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్టమైన అధ్యయనం ఏచూరి ప్రత్యేకతన్నారు. వివిధ సంఘాల నాయకులు వి.శివనాగరాణి, జె.శివశంకరరావు, కె.అజయ్‌కుమార్, ఇ.అప్పారావు, కె.ఈశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, బ్రహ్మయ్య, డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, పార్వతి, అప్పలస్వామి, గాంధీ పాల్గొన్నారు. కుంచనపల్లిలో సభకు సిపిఎం నాయకులు ఎన్.కిషోర్‌బాబు అధ్యక్షత వహించగా 2వ శాఖ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎ.రంగారావు పూలమాలలేశారు. కె.కాశీరాంబాబు, కె.వీరాంజనేయులు, సాంబశివరావు, ఎ.పరంధాముడు, సిహెచ్.రమేష్ పాల్గొన్నారు. గుండిమెడ సభలో పి.కృష్ణ మాట్లాడారు. బి.సంసోను, జి.రవి, బాబురావు, శివయ్య, జోనేష్, వీరయ్య పాల్గొన్నారు. **యడ్లపాడు** లోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కన్వీనర్ జె.శంకరరావు అధ్యక్షతన సభ జరిగింది. పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. బిజెపి వ్యతిరేక శక్తులను ఏకం చేసి 'ఇండియా' బ్లాక్ ఏర్పాటుకు కషి చేసిన దూరదృష్టికి కలిగిన గొప్ప మార్క్సిస్టు మేధావి, మానవతావాది సీతారాం ఏచూరి అని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో వామపక్షాలతో మంచి సంబంధాలను నెలకొల్పారని చెప్పారు. నేపాల్‌లో అంతర్గత సమస్యలకు పరిష్కారం చూపారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు, ఎన్.కాళిదాసు మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి సీతారాం ఏచూరి ఉద్యమించారని, ప్రపంచ మేధావులు గుర్తించిన గొప్ప మార్క్సిస్టు మేధావి ఆయనని చెప్పారు. ప్రజా సమస్యలను పార్లమెంటులో వినిపించిన ఆయన తన వాదనా పటిమతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేవారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం రావడంలో ఆయన కృషి ఎంతో ఉందని గుర్తు చేశారు. అనంతరం కె.రోశయ్య, టి.కోటేశ్వరరావు మాట్లాడారు. **తుళ్లూరు**లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు మాట్లాడారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, ఫెడరల్ విధానం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు చివరి శ్వాస వరకు సీతారాం ఏచూరి కృషి చేశారని చెప్పారు. పి.బాబురావు,షేక్ జానీ, కె.ఆంజనేయులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **మంగళగిరి** పట్టణం రత్నాల చెరువులోని సింహాద్రి శివారెడ్డి భవనంలో సభ నిర్వహించగా సిపిఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడారు. పి.బాలకృష్ణ, ఎం.చంద్రారావు, ఎం.చలపతిరావు, జె.శివభావన్నారాయణ,


మంగళగిరి


చిలకలూరిపేట



పెదకాకాని


ప్రత్తిపాడు

జె.భార్గవ్, డి.నగేష్, బి.స్వామినాథ్ పాల్గొన్నారు. **మంగళగిరి రూరల్** ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహించగా సిపిఎం సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య మాట్లాడారు. యు.దుర్గారావు, పి.ప్రసాద్, జి.అజయ్‌కుమార్, సిహెచ్.సీతారామాంజనేయులు శర్మ, గిరిధర్, బాబ్జీ, కె.లక్ష్మి, సంధ్య, జి.లక్ష్మి, ఎం.శ్రీను, వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **క్రోసూరు**లోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో టి.హనుమంతరావు అధ్యక్షతన సభ నిర్వహించగా పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడారు. టి.శ్రీనివాసరావు, జి.రమణమ్మ, జి.సైదా, ఎన్.చిన్నమ్మాయి, కె.లక్ష్మి పాల్గొన్నారు. **గుంటూరు** లక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షులుగా సీతారాం ఏచూరి కృషిని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ మాట్లాడుతూ దేశంలో అందరికీ విద్య దక్కాలని ఏచూరి విద్యార్థి దశ నుండి పోరాడారన్నారు. విద్యార్థి నాయకుడి నుండి పలు బాధ్యతలు నిర్వహించి రాజ్యసభ సభ్యుడిగా ప్రజా సమస్యలను ప్రస్తావించి ఆదర్శంగా నిలిచారన్నారు. దేశంలోని అనేక రంగాల సమస్యలపై లోతైన అధ్యయనం, అవగాహనతో స్పష్టమైన ప్రత్యామ్నాయాలు చూపే వారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.పవన్‌కుమార్, ఎస్.కె.సమీర్, నగర కార్యదర్శి ఎ.యశ్వంత్ పాల్గొన్నారు. **చిలకలూరిపేట**లోని సిపిఎం కార్యాలయంలో సభకు టి.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పలువురు పూలమాలలేశారు. పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, పి.భారతి, పి.శివపార్వతి, బి.లక్ష్మణ్, సుబ్బారెడ్డి, బాబు, బుచ్చిబాబు, ఫైరోజ్, దరియా హుస్సేన్, ఖమర్, బాలు నాయక్, రహమాన్, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు. **దుగ్గిరాల** ప్రజా సంఘాల కార్యాలయంలో నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు మాట్లాడారు. ఎన్.యోగేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, వి.కృష్ణమూర్తి, రాజశేఖర్, మాణిక్యమ్మ పాల్గొన్నారు. **మేడికొండూరు** సభలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ మాట్లాడారు. ఇమామ్ షరీఫ్, ప్రసాదరావు, ఎస్.కె షరీఫ్, మహమ్మద్, బాలకోటయ్య పాల్గొన్నారు. **పెదకాకాని**లోని సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు, ఎన్.శివాజీ పూలమాలలేశారు. అనంతరం ఎన్.శివాజీ మాట్లాడారు. జి.రాజారమేష్, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం, ఎ.నాగేశ్వరావు, కె.గురువమ్మ, ఆర్.వెంకటరమణ, నాగూర్‌బి పాల్గొన్నారు. **పెదనందిపాడు**లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు అధ్యక్షతన సభ జరిగింది. సీతారాం చిత్రపటానికి సీనియర్ నాయకులు జె.రామారావు, కె.వెంకట సుబ్బారావు పూలమాలలేసి నివాళులర్పించారు. ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.రాజేంద్ర, భువనేశ్వరి, షమ్మి, ఎం.లక్ష్మి, కె.లక్ష్మి, వాసవి పాల్గొన్నారు. **ఫిరంగిపురం**, పొనుగుపాడులో సభలు నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడారు. బి.ఇబ్రహీం, అనుక్, మస్తాన్‌వలి, కె.రాఘవయ్య, ఇ.హరిబాబు, జి.వి.రావు, కె.కోటేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, వై.కృష్ణమూర్తి, బాబురావు, కె.వెంకట్రావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు**లోని సిపిఐ కార్యాలయం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరావు అధ్యక్షతన సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. అంజిబాబు, కె.అంకమ్మరావు, ఎం.పిచ్చయ్య, పి.వీరయ్య, తాతారావు పాల్గొన్నారు. **తాడికొండ** బస్టాండ్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.భాస్కరరావు మాట్లాడారు. ఐ.రామారావు, ప్రసాద్, డేవిడ్, రాజు, కె.పిచ్చయ్య, శ్రీనివాసరావు, సుభాని, రైతులు పాల్గొన్నారు. **ముప్పాళ్ల** మండలంలోని మాదల, నార్నెపాడు గ్రామాల్లోని సిపిఎం కార్యాలయాల్లో సీతారాం ఏచూరి వర్ధంతి సభలు జరిపారు. మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడారు. ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, జి.జాలయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, టి.బ్రహ్మయ్య, నార్నెపాడు సర్పంచ్ కె.ప్రభాకర్, ఎన్.సాంబశివరావు, ఐ.శ్రీను పాల్గొన్నారు.


తాడికొండ


క్రోసూరు


ముప్పాళ్ల

సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు కోరారు. శుక్రవారం సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. కాపు వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. నాగులపాడు, పాలపర్రు, పెదనందిపాడు గ్రామాలలో మంచినీటి సమస్య ఉందన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని కోరారు. రోడ్ల సమస్యలు అన్ని గ్రామాలలో ఉన్నాయని అన్నారు. నాగులపాడు చెంచుల కాలనీలో మంచినీటి సమస్య ఉన్నదని, పరిష్కారం కోసం మంచినీటి ట్యాంకు నిర్వహిస్తానని సుదీర్ఘకాలంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు హామీ ఇస్తున్నారు తప్ప ఇప్పటివరకు ట్యాంక్ నిర్మించలేదని అన్నారు. వరగాని ఎస్సీలకు స్మశానవాటిక సమస్య ఉన్నదని, వారికి మరొక ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే రైతులకు అవసరం మేరకు ఎరువులు యూరియా, డిఏపి అందించాలని కోరారు. అలాగూ భూసేకరణకు నిధులు విడుదల చేసి గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులపై వేధింపులు ఆపాలి. పెదనందిపాడు జిల్లా పరిషత్, వరగాని, నాగులపాడు, కొప్పర్రు పాఠశాలలలో కొంతమంది ఉపాధ్యాయులు పిల్లలను ఉసిగొల్పి వంట బాగా చేసినా బాగా లేదని చెప్పమంటున్నారని, ప్రస్తుతం ఉన్న మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించమని హెడ్ మాష్టారుపై వత్తిడి తెస్తున్నారని అన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకు లలో పంట రుణాలు మంజూరు చేసేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమ్మి, జంపని రామారావు పాల్గొన్నారు


మాట్లాడుతున్న నాయకులు డి రమేష్‌బాబు



హిందీ కవుల వేషధారణలో విద్యార్థులు

సుమేధలో ముందస్తు హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవారం ముందస్తు హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. హిందీ భాష దేశంలో మొదటి స్థానంలో, ప్రపంచంలో మూడోస్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులు అందరూ హిందీపై నిర్లక్ష్యం చేయకుండా నేర్చుకోవటం వల్ల దేశంలో ఎక్కడికెళ్లినా జీవించవచ్చని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు హిందీ గేయాలను, హిందీ కవుల వేషధారణలతో, నృత్య ప్రదర్శనలు చేశారు. ఉపాధ్యాయులు హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు.


విద్యార్థులను అభినందిస్తున్న మద్దుల నరేష్‌కుమార్

సైక్లింగ్ పోటీలలో వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా స్థాయి అండర్ -19 సైక్లింగ్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న గుంటూరు జిల్లా తెనాలి మండలం తుమ్మలూరు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పోటీలు జరిగాయని తెలిపారు. పోటీలో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ముక్కల శశి కుమార్, జక్కుల ప్రసన్నకుమార్ లు ఈ నెల 24 న మంగళగిరి లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను, డైరెక్టర్ నరేష్ కుమార్, కళాశాల ఛైర్మన్ మద్దుల కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ నర్రా శేషగిరిరావు, నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివ నాగేశ్వరరావు, పిడి వై.సురేష్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలకు దివ్యశ్రీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల


దివ్యశ్రీ

మండలంలోని దమ్మాలపాడు గ్రామానికి చెందిన బూర్ల దివ్యశ్రీ జిల్లాస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. దమ్మాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న దివ్యశ్రీ నర్సారావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శుక్రవారం జరిగిన కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా దివ్యశ్రీ ని గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

అన్ని రంగాలలో మహిళలు కీలకపాత్ర : డాక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేడు కుటుంబ వ్యవస్థ దగ్గర నుండి సమాజంలో అన్ని రంగాలలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని విద్య, వ్యాపారం, ఉద్యోగం ఇలా ఎన్నో రంగాలలో పురుషులతో ధీటుగా రాణిస్తున్నారని గుంటూరు అహల్య నర్సింగ్ హోం వైద్యురాలు మహిళల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాజ కుమారి అన్నారు. నరసరావుపేట మండలంలోని జన్నలగడ్డ గ్రామ పరిధిలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినిలకు ఋతుక్రమ సమయంలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు ముందుగానే గుర్తించే కొన్ని వ్యాధుల లక్షణాలను వివరించారు. పిసిఓడి, పిసిఓఎస్ బ్రెస్ట్ క్యాన్సర్ లను ముందుగానే గుర్తించే లక్షణాలు, ఇతర అనారోగ్య లక్షణాలు వివరించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే సొంత వైద్యం కాకుండా తప్పనిసరిగా వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తమ కళాశాల విద్యార్థినిలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. సదస్సు అనంతరం కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ సదస్సులో పాల్గొన్న వైద్యులు డాక్టర్ ఎస్.ఉమా శంకర్, ఎస్. రాజ కుమారిలను సత్కరించారు.


విద్యార్థులతో వైద్యులు డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి



కృత్రిమ మేధస్సు, లాంగ్వేజ్ మోడల్స్ పై వివిఐటియూ లో సదస్సు

ప్రజాశక్తి - పెదకాకాని

వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్శిటీ నందు ఏసీఎం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు యొక్క ప్రధాన సూత్రాలు, పద్ధతులు, లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్ (ఎల్.ఎల్.ఎమ్)లపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య వక్తగా అమెరికాకు చెందిన కృత్రిమ మేధ, న్యాచురల్ లాంగ్వేజ్ ప్రొసెసింగ్ నిపుణుడు, సాల్మన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు మరియు సిఈఓ పాల్ సాల్మన్స్ హాజరయ్యారు. పాల్ సాల్మన్ మాట్లడుతూ భవిష్యతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు లార్జ్ లాంగ్వేజ్ మోడట్లు విప్లవాత్మక మార్పులు తీసురాబోతు న్నాయని అన్నారు. కృత్రిమ మేధస్సుతో కూడిన అప్లికేషన్లు, పరిరికరాలు వస్తువులను చూడగలవు, గుర్తించగలవన్నారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, సిఎస్ఎమ్ విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్, సిఏఐ విభాగాధిపతి డాక్టర్ పి. సుధాకర్, ప్రోగ్రామ్ సంధానర్త డాక్టర్ బి.సాయిజ్యోతి, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజల దాహార్తి తీర్చే తాగునీరులో మురుగునీరు కలిసి కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, జాతీయ మానవ హక్కుల కమిటీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి శుక్రవారం అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో మురుగునీరు సమస్యపై గతంలోనే నగరపాలక సంస్థ అధికారులకు తాగునీరులో మురుగునీరు కలిసి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని తెలిపామని అన్నారు. ఇటీవల అధికంగా వర్షాలు కురవడం వలన, వర్షపు మురుగునీరు తాగునీరు బోరు వద్ద కు చేరడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఒకవైపున వైరల్ ఫీవర్స్ అధికంగా ఉండడం మంచినీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడతారని ఆందోళన చెందుతున్నారని అన్నారు. తక్షణమే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి, ఇప్పటం గ్రామ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆయన కోరారు.

ఎపి మోడల్ స్కూల్‌లో యాన్యువల్ స్టూడెంట్స్ కాంపిటీషన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామంలోని పియం శ్రీ ఎపి మోడల్ స్కూల్‌లో శుక్రవారం "వారధి ఇండియా ఫౌండేషన్" ఆధ్వర్యంలో యాన్యువల్ స్టూడెంట్స్ కాంపిటీషన్స్-2025 కార్యక్రమం శుక్రవారం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ పర్యవేక్షణలో పోటీలు విజయవంతంగా జరిగాయి. గెలుపొందిన వారు జిల్లా స్థాయి కాంపిటీషన్స్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రవినాయక్ తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయి కాంపిటీషన్స్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవినాయక్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు


పోటీలలో గెలుపొందిన విద్యార్థులు

రేషన్ డీలర్‌పై చర్యలు

ప్రజాశక్తి - తెనాలి


రేషన్ షాపును పరిశీలిస్తున్న తహశీల్దార్

నిబంధనలకు వ్యవహరిస్తున్న రేషన్ డీలర్‌పై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. స్థానిక సాలిపేట లోని 39వ షాపు డీలర్ పువ్వాడ హనుమంతరావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, నో స్టాక్ బోర్డు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆమేరకు శుక్రవారం ఆయన షాపును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఆరోపణలను నిర్ధారించి షాపును సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ జాన్, వీఆర్వో, సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఈనెల 15న జరిగే రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులంతా విజయవాడకు తరలిరావాలని పల్నాడు భావన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అమరావతి బస్టాప్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలసి ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కాలం పూర్తయినా వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరిస్థామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా భారం కాదన్నారు. ఇప్పటికే వెల్ఫేర్ బోర్డులోనే వేల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం చేయాల్సిందల్లా వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని నిర్ణయం చేస్తే చాలని ఆయన సూచించారు. దీంతో వేలాది మంది భవనిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు అవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ ఎన్నికల హామీని అమలు చేయాలని, ఒక రూపాయి కూడా ఆర్థిక భారం లేని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న విజయవాడ రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు, పట్టణ అధ్యక్షులు జి.సాల్మన్‌రాజు, మండల కార్యదర్శి షేక్ సైదులు, సిఐటియు నాయకులు పురుషోత్తం, ఇతర ప్రజాసంఘాల నాయకులు జిల్లేళ్ళ పాల్ రాజు, శేఖర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

డ్వాక్రా మహిళలకు రుణాలకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ ప్రజావేదికలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 30 స్వయం సహాయక సంఘాల కు వివిధ బ్యాంకుల ద్వారా మంజూరైన రూ.4 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు తోట అంబిక టిడిపి రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి వందనా దేవి, మెప్మా సిబ్బంది యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



చిత్రపటాలను అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

విశ్వకర్మ భగవాన్ చిత్రపటాల అందచేత

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సష్టికర్త భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈనెల 17వ తేదిన సత్తెనపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మండల తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ నగేష్‌కు ఎస్ఐ సోమేశ్వరరావు, ఎంపిడివో పి.రత్నంకు ప్రభుత్వ వైద్యశాలలో విశ్వకర్మ భగవాన్ చిత్రపటాలను శుక్రవారం అందచేశారు. విశ్వ బ్రహణ సతైనపల్లి నియోజకవర్గ సంఘం నాయకులు చింతాడ రమేష్ మాట్లాడుతూ సతైనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలతో ఈనెల 17వ తేదిన పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం వద్ద విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తారన్నారు. విశ్వ బ్రాహ్మణ సతైనపల్లి పట్టణఅధ్యక్ష, కార్యదర్శులు పోతు లూరయ్య, భాస్కరఛారి, ముప్పాళ్ల మండల నాయకులు క్రోసూరి రాంబాబు, గుత్తికొండ వెంకటాచారి, తేనేపల్లి శ్రీని వాసాచారి కన్నెగంటి రామబ్రహ్మాచారి, అత్తలూరి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, అద్దంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలపై తహాశీల్దార్‌కు వినతిపత్రం

ప్రజాశక్తి - కారంపూడి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తలపెట్టిన నిరసనవారంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కారంపూడి మండల శాఖ రెండవరోజు నిరసన ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కారంపూడి మండల తహాశీల్దార్‌కు మెమొరాండం అందజేశారు. మండల టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు నాయక్ ఉపాధ్యాయుల సమస్య లను కారంపూడి తహాశీల్దార్‌కు వివరించి ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మెమొరాండం చేరవేయగలరని వారు కోరారు. ప్రభుత్వ డిఏలు నాలుగు పెండింగ్‌లో వున్నాయని వాటిని సకాలంలో ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. మండల శాఖ కార్యవర్గ సభ్యులు జి.భాస్కర్‌రావు, జి.శ్రీనివాసరావు, జె.విజయ్



ఒప్పిచెర్లలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు



సత్తెనపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

రైతులకు ఎరువులు సరఫరా

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలో ఎరువులు డిసిఎంఎస్, పిఎసిఎస్, ప్రైవేట్ డీలరు, రైతుసేవా కేంద్రాలు ద్వారా రైతులకు సరఫరా చేస్తారని క్రోసూరు మండల వ్యవసాయాధికారి వేణు గోపాల్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు డిసిఎంఎస్-176.9, పిఎసిఎస్-99, రైతుసేవా కేంద్రాలు -59.4 ప్రైవేట్ డీలర్లు-428 మొత్తం కలిపి 763.3 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు పంటకాలానికి సరిపడే మొత్తం యూరియా ఒకేసారి కొనుగోలు చేయడం వల్ల మిగిలిన రైతులకు అందడం లేదన్నారు. రైతులు అవసరం మేరకు యూరియాకొనుగోలు చేయాలన్నారు. గుళికల యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ఎకరాకు 500 మి.లీ. చొప్పునపై పాటుగా పంటపై పిచికారి చేసు కొనవచ్చును. మోతాదుకు మించి యూరియా వాడడం వల్ల పురుగులు, తెగుళ్ల పంటను ఆశించడమే కాకుండా రైతుకు పెట్టు బడి ఖర్చు గణనీయంగా పెరుగుతుందన్నారు.

ప్రజాశక్తి - కారంపూడి

ఒప్పిచెర్ల గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశామని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామాల రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తుందని ఆయన తెలిపారు. కారంపూడిలోని ప్రాథమిక సహకార సంఘానికి, జిడిసిఎంఎస్‌కి, మన గ్రోమోర్ కేంద్రాలకి, ప్రైవేట్ డీలర్లుకు యూరియా సరఫరా అవుతోందన్నారు. వరి నాటిన వారు మొదట విడత మాత్రమే యూరియా వేసుకోవాలని, రెండవవిడత, రెండునెలల తర్వాత, మూడవ విడతలలో యూరియాకు బదులుగా నానో యూరియాను వాడాలన్నారు. రైతులందరూ శ్రేష్టమైన కొత్త నానోయూరియా టెక్నాలజీని ప్రోత్సహించి లబ్ధి పొందాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న జీడిసిఎంసి ఎరువుల విక్రయ కేంద్రం ద్వారా 19.8 మెట్రిక్ టన్నుల (440 బస్తాలు) యూరియా రైతులకు శుక్రవారం పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులో ఉంచుతామనీ, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. నానో యూరియా పైపాటుగా పిచికారి చేసుకోవటం వలన పంటకు కావలసిన నత్రజని అంది వాతావరణ, నీటి కాలుష్యం తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి రవిబాబు, సత్తెనపల్లి మండల ప్రత్యేక అధి కారి గృహ నిర్మాణ శాఖ డిఈ వి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి

నాదెండ్ల : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ఉద్యోగులు తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ ఎంపీడీవో స్వరూపరానికి శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. తమకు అదనపువిధులు, పనిఒత్తిడి, క్షేత్ర స్థాయి బాధ్యతలు కేటాయించవద్దని వారు కోరారు.



ఎంపిడిఓకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

యూరియా కొరతపై పిన్నెల్లి చర్చకు రావాలి : జూలకంటి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

యూరియా కొరత, పంపిణీపై దమ్ముంటే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చర్చకు రావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక కెసిపి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల కొరత ఉందని కృత్రిమ పోరాటం చేస్తూ వైసీపీ రైతులను తప్పుదోవ పట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో అన్ని సొసైటీలు, మార్కెట్ యార్డులు, మార్క్‌ఫెడ్, గ్రోమోర్ సెంటర్లలో వందల మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి రైతుల కోసం మొసలి కన్నీరు కార్చడం ఆశ్చర్యమని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకొని మీ తండ్రి వెంకటేశ్వరరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి చేసిన ఎరువులు, యూరియా కుంభ కోణంపై సవాల్‌కు సిద్ధమా అంటూ పిన్నెల్లిని నిలదీశారు. వేలమెట్రిక్ టన్నుల యూరియా, ఎరువులు ఎలా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారో లెక్కలు బయట పెట్టమంటావా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయంలో పత్తి, కందిపంటల అమ్మకాల్లో జరిగిన అవినీతిపై త్వరలో రామకృష్ణారెడ్డి అండ్‌కో పైఆధా రాలతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ మలేశ్వరిమధు, పార్టీ సినియర్ నాయకులు మద్దిగపు వెంకటరామిరెడ్డి, గోగుల వెంకటరామిరెడ్డి, గుండా శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు కృష్ణవేణి, మంజుల అంజి, పీర్ పాల్గొన్నారు.



శివపార్వతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయుల సంఘం



గంధం గంగయ్యను సన్మానిస్తూ...

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన సభ

ప్రజాశక్తి - అచ్చంపేట

ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాలో అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు కోనూరు ఎంపీపీ ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు గంధం గంగయ్య, నీలేశ్వర పాలెం ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు నంద్యాల శివపార్వతికి అచ్చంపేట ఫ్యాప్టో ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. అచ్చంపేటలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఎంఈఓ ఏకుల ప్రసాదరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పిటిసి తుమ్మ విజయప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయు లకు సామాజిక బాధ్యత సామా జిక పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అనంతరం దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు టి సౌరెడ్డి బి.సాంబశివరావు ఆర్.వేణు గోపాలరావు షేక్ మహబూబ్ సుభానీ ఏ.నటరాజు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయంలో రికార్డు తనిఖీ

ప్రజాశక్తి - క్రోసూరు

పల్నాడు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 2(జె)(1) ప్రకారం కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పౌరహక్కుల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి చిర్రా రాజేష్ కుమార్ తనిఖీలు చేశారు. తనిఖీలో జిల్లా శిశుసంక్షేమ శాఖ కార్యాలయం పౌరసమాచార అధికారులు టీ.లోకనందం, అరుణరాణి, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు. చిర్రా రాజేష్‌కుమార్ మాట్లాడుతూసమాచార హక్కు చట్టం సెక్షన్ 2(జె)1 ద్వారా మాత్రమే కార్యాలయాలలో ఫోటోలు, వీడియోలు తీసుకొని అధికారుల నిర్లక్ష్యం, అవినీతికి చెక్ పెట్టవచ్చున్నారు. అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణికి 75 తాళ్లూరు నుంచి క్రోసూరుకు ఐసిడీఎస్ క్రోసూరు ప్రాజెక్ట్‌ను తరలించాల్సిన అవసరం ఉందని ఆధారాలతో విజ్ఞప్తి చేశారు.

రక్తదాన శిబిరం అభినందనీయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, పెదకూరపాడు తహాశీల్దార్ ఎన్.ధనలక్ష్మి, ఎండిఓ సోమయాజులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచనతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో, తహాశీల్దార్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. యువత విద్యార్థులు ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడేందుకు సహాయపడుతుందన్నారు. శిబిరంలో ఈవో పిఆర్‌డి శరత్, ఏపీఎం జయరావు, టిడిపి సీనియర్ నాయకులు మద్దినేని సత్యం, పాటిబండ్ల యోహాను, ఏటుకూరి సురేష్, కొండవీటి ప్రసాదు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, యువగళం కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - వినుకొండ

మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ డి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లపల్లి మండలం పరమేశ్వరి వైన్స్, గణేష్ వైన్స్, వెంకటేశ్వర వైన్స్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యం దుకాణాల వద్ద ఎమ్మార్పీ ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్నారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు మద్యం దుకాణాల్లో క్యూఆర్ సర్వే గురించి షాపుల వద్ద ప్రచారం చేశామని తెలిపారు. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా దుకాణాలు మీద నిఘా ఉంచుతామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ వెంట సిబ్బంది ఉన్నారు.

పంట నమోదుకు 30న ఆఖరు

ప్రజాశక్తి-ఈపూరు

రైతు సేవ కేంద్రంలో ప్రతి సర్వేనెంబర్‌లో సాగు చేసిన పంటను ఈనెల 30వ తేది కల్లా నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి ఏఓ ఆర్.రామారావు సూచించారు. మండల కేంద్రమైన ఈపూరు రైతు సేవ కేంద్రంలో శుక్రవారం సిబ్బం దితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును రైతు సేవా కేంద్రాలలో అందు బాటులో ఉంచామన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతు లు ఈకేవైసీని చేయించు కోవాలన్నారు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌నెంబర్ లింక్ లేని రైతులు ఎన్పీసీఐ లింక్ చేయించు కోవాలన్నారు. ఏఈఓ సునీత పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - కారంపూడి

నేడు రెండవ శనివారం మండల విద్యుత్ విని యోగదారులకు కారంపూడి మండలం పరిధిలోని అన్ని 33కెవి, 11కెవి సబ్ స్టేషన్ల పరిధిలోని లైన్లు మరమత్తులు దృష్ట్యా నేటి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కారంపూడి మండలలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని మండల విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. వినియోగదారులు, రైతు సోదరులు గమనించి సహకరించ గలరని వారు కోరారు.

నిధి భవన్ ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఆటోనగర్‌లోని నిధి భవన్ ఎదుట పెండింగ్ బిల్లుల సమస్యలపై స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) ఆధ్వర్యంలో శుక్రవారం కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 200 మంది కాంట్రాక్టర్లు నిరసనలో పాల్గొన్నారు. కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. అనంతరం నిధి భవన్ సీఈవో గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్ల సమస్యలపై సీఈవో గౌతమ్ కు వినతి పత్రం అందజేసి తమ సమస్యలు వివరించగా సానుకూలంగా స్పందించి పరిశీలించారన్నారు. కాంట్రాక్టర్లు పది రోజులు వరకు మాత్రమే పోర్టల్‌లో బిల్లులు ఎక్కుతాయని అపోహలో ఉన్నారని, అది నిజం కాదని 30 రోజుల వరకు పోర్టల్స్‌లో బిల్లులు ఎక్కుతాయని సీఈవో చెప్పారని కాంట్రాక్టర్స్ ఆ విషయం గమనించాలన్నారు. సీడీఎంఏ కమిషనర్ కూడా నిధి భవన్‌కి రావడంతో మున్సిపాలిటీలలో కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్ళగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి కొండా రమేష్, కోశాధికారి అప్పారావు, గుంటూరు, కృష్ణా, వెస్ట్ గోదావరి, కాకినాడ జిల్లాల అసోసియేషన్ల అధ్యక్షులు కె.వెంకట్రావు, మండవ సాయి, రాంబాబు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.



నిధి భవనం ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టర్లు



చింత క్రింది దంపతులను పరామర్శిస్తున్న నాయకులు

చింత క్రింది దంపతులకు పరామర్శ

ప్రజాశక్తి - మంగళగిరి

నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న మంగళగిరికి చెందిన ఎనిమిది మంది రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చొరవతో సురక్షితంగా సురక్షితంగా చేరుకున్న స్థానిక హాస్పటల్ రోడ్డులోని చింతక్రింది కేంద్రప్రసాద్, పద్మావతి దంపతులను శుక్రవారం పెదవడ్లపూడి మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అన్నే నందకిషోర్‌లు కలిసి, వారిని పరామర్శించారు. చింతక్రింది దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్రా ఏడుకొండలు, అఫ్జల్, తుమ్మా సత్యనారాయణ, ఉద్దంటి అప్పారావు, చింతక్రింది సాంబశివరావు పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని టిడ్కోకు చెందిన బట్టు నాగేశ్వరమ్మకి రూ.70వేల చెక్కును టిడిపి నాయకులు శుక్రవారం అందజేశారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్య మంత్రి సహాయనిధి నుండి ఈ చెక్కు మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాసా పద్మావతి, బూదాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజా సహకారంతోనే దోమల నియంత్రణ

ప్రజాశక్తి - తెనాలి

ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ సాధ్యమని వైద్యాధికారులు తెలిపారు. స్థానిక చినరావూరుతోట మదర్ థెరిస్సానగర్‌లో శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సి.హెచ్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిలువ లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు నియంత్రణ ద్వారా దోమల ఉత్పత్తి తగ్గి వాటి ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ,ఫైలేరియా, చికెన్ గునియా, మెదడువాపు వంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్ట వచ్చునన్నారు. ఇంటింటికి దోమల నియంత్రణకు కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఎస్.ఉమాకాంత్, ఎ.బాలచంద్రమౌళి, డి.శ్రీనివాసరావు, షేక్ రషీద్, సయ్యద్ కరీముల్లా, పాముల అన్నపూర్ణ, బళ్ళ సుధారాణి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి వితరణ

ప్రజాశక్తి - ఏఎన్‌యు



వీసీకి చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ స్వర్ణోత్సవ వేడుకల లో అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని విశ్వ విద్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఒగ్గు నాగేశ్వరరావు 50 వేల రూపాయలను వర్సిటీకి వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ మేరకు విసి ఆచార్య కే.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి లకు ఆయన చెక్కు అందజేశారు. విసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పట్ల నాగేశ్వరరావు చూపిన అంకితభావాన్ని అభినందించారు. సందర్భంగా పెన్షనర్ల సంఘం, ఇతర సహచర ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

జెవివి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక నిర్మల జూనియర్ కళాశాలలో విజయనగరంలో ఈనెల 13, 14 తేదీలలో జరగనున్న జనవిజ్ఞాన వేదిక 18 వరాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.వి.ప్రసాద్, జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డిలు మాట్లాడుతూ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. 13వ తేదీన ప్రారంభ సమావేశంలో ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి పరిశీలనలు సూచనలు అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. 14వ తేదీన జరిగే కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పర్యావరణ సమస్యలు పరిష్కారాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆశా వర్కర్ కుటుంబానికి పరిహారం అందజేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - చేబ్రోలు

మరణించిన ఆశా వర్కర్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రమణ అధికారులకు విజ్ఞప్తి చేశారు. చేబ్రోలులో నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ చనిపోయిన ఆశా వర్కర్ సులోచన మృతదేహాన్ని శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరామర్శించడానికి వచ్చిన డిఎం అండ్ హెచ్ఓని కలిసి చనిపోయిన ఆశా వర్కర్ కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు. కనీసం అనారోగ్యం సరిగా లేదని చెప్పినా సెలవులు ఇవ్వడానికి నిరాకరిస్తూ ప్రాణాల మీదగా తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆఫీస్ సిబ్బంది వచ్చి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

తమ సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది మూడు నెలల కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డిఎలు, సిపిఎస్ రద్దు, 12వ పిఆర్సి కమిషన్ నియామకం, వేతన సవరణలు, ఈ.హెచ్.యస్ పరిమితిని 25 లక్షల రూపాయలకు పెంపు, అన్ని రకాల ఆర్థిక బకాయిల చెల్లింపులు తదితర కీలక అంశాల్లో విపరీతమైన నిర్లక్ష్యతను ప్రదర్శిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి.భాస్కర్, సయ్యద్ జహంగీర్, అరుణ్‌రావు వెంకటేశ్వర రావు, పేరయ్య, జాహిద్, పద్మజ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఈ నెల 22న హైదరాబాద్‌లో జరిగే మాదిగల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ అధ్యక్షులు వినుకొండ ఏసుబాబు, జిల్లా కార్యదర్శి డి.బాబూరావు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు సభ జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు , కె. బెర్నార్డ్ మాదిగ, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కొమరాల శ్రీనివాస్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వలేటి భూషణం మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి భగత్ సింగ్ మాదిగ, నియోజక వర్గ సహాయ కార్యదర్శి దార గురవయ్య మాదిగ, అనుబంధ సంఘాలు మండల అధ్యక్షులు శ్రీ కారెంపూడి బసవరాజు రూరల్ మండల గౌరవ అధ్యక్షులు సిద్దేల ఇశ్రాయేలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో రోగుల ఇక్కట్లు

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రైవేట్ వాహనాల పార్కింగ్, శుక్రవారం 108 కూడా లోపలికి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులతో గొడవలు పడలేక నిస్తేజంగా వైద్య సిబ్బంది. పక్కన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండటం వలన నిత్యం అనేక వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేసుకొని వెళుతున్నారు. దీని వలన ఆసుపత్రి వచ్చే రోగులు చాలా ఇబంది పడుచున్నారని ఆసుపత్రి సిబ్బంది చెప్తున్నారు. స్థానికులే వాహనాలు అడ్డుపెట్టి ఉండటం, వాదనలు చేయడం వలన చేసేది ఏమీ లేక తల పట్టుకుంటున్న సిబ్బంది. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు కల్పించుకొని సమస్యను పరిష్కరించాలని చేబ్రోలు ప్రాథమిక వైద్యశాల సిబ్బంది కోరుతున్నారు .

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 11కెవి విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డిఈఈ అశోక్ కుమార్ తెలిపారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

283వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 283వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కె.స్టీవెన్, సీఐటీయూ నాయకులు వి.దుర్గారావు, బూరగ అంకయ్య, వై.సుబ్బారావు, ఎం.గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో ఎ.డి.ఇస్మాయిల్, యహోషువ, జి.వెంకటేశ్వర్లు, వె.సాంబశివరావు, యు.కాశమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, డి.మాణిక్యారావు, వై.రమాదేవి, ఈ శరమ్మ, ఎం.శివ కుమారి, వి.రిబ్కా, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



తనిఖీ చేస్తున్న సిడిపిఓ విజయలక్ష్మి

నడిపాలెం ఎస్సి కాలనిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సిడిపిఓ విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలు యొక్క బరువు ఎత్తులను పరిశీలించారు. కొత్తగా ఇచ్చిన పరికరాలతో కాకుండా పాత వాటితో ఎత్తు కొలతలు చూడటం వలన తేడాలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేకుల షెడ్డులో అంగన్‌వాడీ ఉండటం ఏమిటి , రెండు వేల రూపాయలు చెల్లిస్తున్నాం కదా అని అన్నారు. అనంతరం పలు రిజిస్టర్లను పరిశీలించి సరుకులను తనిఖీ చేశారు. ఆమె వెంట అసిస్టెంట్ సిడిపిఓ విజయ నిర్మల ఉన్నారు.



మాట్లాడుతున్న నీలాంబరం

కళాకారులు చిరస్మరణీయులు

ప్రజాశక్తి - తెనాలి

ప్రజల హృదయాలను దోచుకున్న కళాకారులు చిరస్మరణీయులని ప్రజానాట్యమండలి జిల్లా సంయుక్త కార్యదర్శి దేవరపల్లి నీలాంబరం అన్నారు. స్థానిక గాంధీ నగర్ ఇస్కస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ సభలో శుక్రవారం ఎం.జె. మోహనరావు, జంగాల సీతారామయ్యకు నివాళులు అర్పించారు. సభకు అధ్యక్షత వహించిన నీలాంబరం మాట్లాడుతూ కమ్యూనిస్టు ముద్దుబిడ్డలుగా, కళాకారులుగా మోహనరావు సీతారామయ్య ప్రజలకు చేరువయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ, సిపిఐ తెనాలి ఏరియా కార్యదర్శి టి.బాలస్వామి, టి.గోపికృష్ణ, బదరి, నాగమణి పాల్గొన్నారు.

కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి)లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు సమన్వయంతో చేబ్రోలు చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో జిల్లా పంచాయతీ వనరుల కోఆర్డినేటర్ అనురాధ శిక్షకులుగా వ్యవహరించి నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి 1,000 కుటుంబాలకు ఒక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌ను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, టి.సాయి శ్రీనివాస్, పుండరీనాథ్, ఎంసిఓఎస్‌బిఎంజి ప్రసాద్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ప్రవీణ్‌కుమార్‌కు తమ యూనివర్సిటీ పిహెచ్‌డి పట్టా అందించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ప్రవీణ్‌కుమార్ 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్ - బేస్డ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ఎమోషన్ రికగ్నిషన్ ఇన్ ఇంగ్లిష్ పొయిట్రీ' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని సీఎస్ఈ ప్రొఫెసర్ ఎస్వీ ఫణీకుమార్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌ను వీసీ, డీన్‌లు, అధ్యాపకులు అభినందించారు.



ప్రవీణ్‌కుమార్‌కు పిహెచ్‌డి పట్టా అందచేస్తున్న వీసీ

వాటర్ వర్క్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరానికి సరఫరా అయ్యే మంచినీటిని అంచెలంచెల పద్ధతితో శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నామని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తక్కెళ్లపాడు వద్ద వాటర్ వర్క్స్ ను శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపల్ అధికారులతో నీటి శుద్ధిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు నగరానికి సరఫరా అయ్యే మంచినీటి విషయంలో ఎంతో జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. తక్కెళ్లపాడు వద్ద వాటర్ వర్క్స్‌ను గంట గంటకు పరిశీలిస్తున్నారని చెప్పారు. క్లోరినేషన్ విషయంలో అప్రమత్తం ఉంటున్నామన్నారు. బీఆర్ స్టేడియం, నెహ్రూనగర్ కు పంపింగ్ అయ్యాక మరోసారి క్లోరినేషన్ చేస్తామని వెల్లడించారు. వీటిని 42 రిజర్వాయర్లకు పంపించాక మరోసారి పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం గహాలకు సరఫరా చేశాక సచివాలయ సిబ్బంది ద్వారా శాంపిల్స్ తీసుకుని మరోసారి పరీక్షిస్తామన్నారు. ఈ విధంగా మంచినీటి సరఫరా విషయంలో రాజీ లేకుండా పని చేస్తున్నామని వెల్లడించారు. శుద్ధమైన నీటిని అందించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని చెప్పారు.

అంగన్‌వాడీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.ధనలక్ష్మీ, ఎవిఎస్ కుమారి - పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా జి.రమణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధనలక్ష్మి, ఏవిఎస్ కుమారి ఎన్నికయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ప్రేమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.శివపార్వతి, కోశాధికారిగా ఈ.రత్నమంజుల, ఉపాధ్యక్షులుగా వి.విజయలక్ష్మి, రుక్మిణి, రజిని, టి.పద్మావతి, ఓ.రోజమ్మ కార్యదర్శులుగా కె.ఎలిజబెత్, హేమలత , అస్మత్‌తార, కె.పద్మ, ఎస్.కె.షాహిదా సహా మరో 18 మంది నూతన కమిటీని ఎన్నుకున్నారు. గత 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా జీతాల పెంపుదల చేయాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని తీర్మానం చేవారు. అదే విధంగా అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఆన్లైన్ వర్క్ చేస్తున్న అంగన్వాడీల ఇబ్బందులు తొలగించేందుకు తక్షణమే 5జి ఫోన్లు ఇవ్వాలని, యాప్‌లు అన్నింటినీ కలిపి ఒకే యాప్‌గా రూపొందించి, పనిభారం, రికార్డుల భారం తగ్గించాలని, ఇంటి అద్దెలు, బిల్లులు ఇతర బకాయిలు తక్షణమే చెల్లించాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం నివారించి, అర్హులకు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులు భర్తీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల విద్యుత్తు బిల్లులు చెల్లించాలని పలు తీర్మానాలను ఆమోదించారు.



ఎం.ధనలక్ష్మీ



ఎవిఎస్ కుమారి



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

కెఎల్‌పి స్కూల్లో హిందీ భాషాదినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం హిందీ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ హాజరై హిందీ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం నిర్వహించే దక్ష అవార్డులలో బాగంగా విద్యార్థులకు బహుళైచ్చిక ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. దీనిలో గెలుపొందిన వారికి వ్యాసరచన పోటీ, అందులో గెలిచిన వారికి కవితల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని అవార్డుకు ఎంపిక చేసి, పాఠశాల వార్షికోత్సవం రోజు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ఇస్తారు. పాఠశాల సెక్రెటరీ మాట్లాడుతూ విద్యార్థులు హిందీ నేర్చుకుంటే దేశంలో ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు భాషా సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగం అధికారిక భాషగా ప్రకటించిందన్నారు. సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన హిందీ నాటికలు, పాటలు అలరించాయి.

టిడిఎస్ పూర్తి చేయాలని యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న టిడిఎస్ పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం గుంటూరు ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హను మంతరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 15తో ఈ-ఫైలింగ్ గడువు ముగుస్తున్నా, నేటి వరకూ గుంటూరు తూర్పు, రూరల్ ఉపాధ్యాయులకు టిడిఎస్ పూర్తి చేయలేదన్నారు. రెండు నెలలుగా ఈ సమస్యపై పలు దఫాలుగా ప్రాతినిధ్యం చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా ఇదే విధంగా జాప్యం చేయటం వల్ల ఉపాధ్యాయులు ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు పెనాల్టీలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొనటంతో ఉపాధ్యాయులుత తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి టిడిఎస్ పూర్తి చేయాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బెల్లంకొండ ప్రసాద్, అది నారాయణ, వెంకటేశ్వరరావు, షకీలాబేగం, నగర కమిటీ నాయకులు ఎం.కోటిరెడ్డి, ఎం.చెన్నయ్య, రెహమాన్, శివరామిరెడ్డి, ధనలక్ష్మి, రాఘవులు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు ఎంఇఒ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు



సమాచార శాఖ డిడిగా రమేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా లోచర్ల రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా సహాయ సంచాలకులుగా పనిచేస్తూ పదోన్నతిపై గుంటూరు డిడిగా నియమితుల య్యారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శ్యామ్‌కుమార్ నుండి బాధ్యతలు స్వీకరించారు. రమేష్ 1996 సంవత్సరం లో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, టెక్కలి, శ్రీకాకుళం, పార్వతీ పురంలలో వివిధ హోదాల్లో పనిచేశారు.

రేపు అవోప ఆధ్వర్యంలో రూ.45 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

అవోప ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సెప్టెంబర్ 14న గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మంది రంలో రూ.45 లక్షలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వను న్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబా బు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవోప కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షత`న శుక్రవారం నిర్వహించిన అవోప సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండర్ ప్రసన్నకుమార్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, క్రేన్ సంస్థల అధినేత కాంతారావు, నందనంపాటి రామాంజనేయులు, దూండి రాకేష్ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో గార్లపాటి సత్యనారాయణ, రాచపూడి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

విద్యుత్ బస్సులను ఆర్టీసీనే నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసిని రక్షించాలని, విద్యుత్ బస్సులు నేరుగా ఎపిఎస్ ఆర్టీసి నిర్వహించేలా పాలసీలో మార్పులు చేయాలని, ఆర్టీసి స్థలాలను పరిరక్షించాలని కోరుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం గుంటూరు బస్టాండ్‌లో మానవ హారం నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసిని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ నాయకులు వి.మధు, డిపో నాయకులు గోలి సుబ్బారావు, సిహెచ్.శ్రీను, వివి.రెడ్డి, నవీన్, మేరి తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు శోధించాలి

ప్రజాశక్తి-గుంటూరు

మెరుగైన నెట్‌వర్క్ పనితీరుకు సమర్థవంతమైన రూటింగ్ ప్రోటోకాల్ దిశగా విద్యార్థులు ఆలోచన చేస్తూ, సాంకేతిక సమస్యలకు సులభతరమైన పరిష్కారమార్గాలను శోధించాలని సాంకేతిక రంగ నిపుణులు డాక్టర్ ఎ.సతీష్ అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 'సపోర్టింగ్ అసిమెట్రిక్ లింక్స్ ఇన్ లో పవర్ నెట్‌వర్క్స్: ఎఒడివి ఆర్‌పిఎల్ ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో సతీష్ పాల్గొని మాట్లాడారు. నెట్‌వర్క్ టెక్నాలజీ పరిణామాల్లో ఎఒడివి ఆర్‌పిఎల్ పద్ధతి ద్వారా తక్కువ విద్యుత్ వినియోగం చేసే నెట్‌వర్క్‌లలో అసమానమైన లింక్‌లను సపోర్ట్ చేయటం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ తరహా సాంకేతిక స్మార్ట్ డివైజ్‌లు, సెన్సార్ నెట్‌వర్క్‌లు, ఐఓటి వాడకంలో, తక్కువ శక్తితో ఎక్కువ పనితీరు అందించటానికి ఉపయోగపడుతుందని సతీష్ తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సతీష్, హాజరైన విద్యార్థులు

తురకపాలెంలో దళితులకు తాగునీరూ కరువే

దళితవాడకు సురక్షిత నీటి సరఫరాలోనూ వివక్ష - వైసిపి నాయకుల బృందం విమర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తురకపాలెంలో దళితులకు సురక్షితమైన తాగునీటి సరఫరాలో కూడా ప్రభుత్వం విఫల మైందని వైసిపి నాయకులు విమర్శించారు. మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు, పార్టీ నాయకులు , డాక్టర్ గజ్జల నాగభూషణం రెడ్డి శుక్రవారం తురకపాలెం గ్రామాన్ని సందర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గ్రామంలో వరుస మరణాలు సంభవించాయన్నారు. కలుషిత నీటి సరఫరా వల్లే ప్రజల ఆరోగ్యం దెబ్బతిందన్నారు. కలుషిత నీటి సరఫరా పై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాన్ స్పందించాలన్నారు. ఇంత వరకు పవన్ కల్యాణ్ గ్రామాన్ని సందర్శించకపోవడం దారుణం అన్నారు. తురకపాలెం గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో చోటుచేసుకుంటున్న వరుస మరణాలపై ప్రభుత్వం ఇంత వరకు నిర్దిష్టమైన కారణాలను చెప్పలేకపోయిందన్నారు. వైద్యారోగ్య, పంచాయతీ రాజ్ శాఖలు ఫెయిల్ అయ్యాయని, గ్రామంలో రెండు నెలలుగా 45 మంది కలుషిత నీటి కారణంగా మత్యువాత పడినా వారి కుటుంబాలను పరామర్శించడానికి కూడా మంత్రి పవన్ కళ్యాన్‌కి సమయం లేదా అని వారు ప్రశ్నించారు. మతుల్లో 18 మంది దళితులేనని తెలిపారు. గ్రామంలో ఇప్పటికీ జ్వరాలు, ఇతర వ్యాధులు ఉన్నాయన్నారు. క్వారీ వ్యర్థాలతో నిండిన సంజీవరావు కుంట లోని నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకి ఎక్కించి అక్కడ్నుంచి దళిత కాలనీకి సరఫరా చేస్తున్నారని తెలిపారు.